

మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే ఫిర్యాదు చేయాలి



పోగొట్టుకున్న ఫోన్లు బాధితులకు అందజేస్తున్న సిఐ

ప్రజాశక్తి - అంబాజీపేట

పి.గన్నవరం సర్కిల్ పరిధిలో ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే మీ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సిఐ రుద్రరాజు భీమరాజు పేర్కొన్నారు. గడచిన మూడు రోజుల్లో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు అయిదుగురికి శుక్రవారం వారి ఫోన్లు సిఐ అప్పగించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక ఆధారంగా పోగొట్టుకున్న ఫోన్లను ఎక్కడ ఉన్నవి గుర్తించి వారికి అప్ప గించి ఫ్రెండ్లీ పోలీస్‌గా సేవలందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఎస్ఐ. కె.చిరంజీవి ఉన్నారు.

నరేగా అమలులో జిల్లా ప్రథమం

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు

ప్రజాశక్తి - అమలాపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (నరేగా) పథకం అమ లులో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఈ ఆర్థిక సంవత్స రంలో 57 లక్షలు పనిది నాలకు గాను 56 లక్షలు పని దినాల కల్పన సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ లు అమరావతి నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఆర్థిక సంవత్సరంలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన లక్ష ఎకరాల్లో పండ్ల తోటల పెంచడానికి ప్రణాళికలు సిద్ధం, పంట సేద్యపు నీటి కుంటలు నిర్మాణం, కొండపల్లి హస్త కళాకారులకు ముడి సరుకు లభ్యత ఏటి కొప్పాక హస్త కళాకారులకు కావలసిన ముడి సరుకు లభ్యత బొబ్బిలి వీణల తయారీకి పనస మొక్కలు పెంచడానికి చర్యలు వంటి అంశాలు, పల్లె పండగ పనులైన గోకులాలు, సిసి రోడ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రోజువారి సగటు వేతనాన్ని రూ.291.21 చెల్లిస్తూ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పల్లె పండగలో 896 గోకులాలు మంజూరు చేయగా వీటిలో 720 గోకులాలు నిర్మాణాలు పూర్తి అయ్యాయని మిగిలినవి పురోగతిలో ఉన్నాయని వీటిని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు.అదేవిధంగా జిల్లావ్యాప్తంగా 118 కిలోమీటర్ల మేర సిసి రోడ్లు మంజూరు చేయగా వీటిలో 84 కిలోమీటర్లు అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం పూర్తయిందని మిగిలిన వాటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయటంతో పాటు కూలీల రోజువారీ వేతనాన్ని 300 వరకు ఇచ్చేందుకు పాటుపడాలన్నారు. ఈ విభాగం బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయటంతో పాటు, పని వేళల్లో మార్పులు చేస్తూ కూలీలకు గిట్టుబాటు వేతనం అందించాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో పని క్షేత్రాలలో నీడ వరకు షెడ్లు ఏర్పాటు చేయాలని సురక్షిత తాగునీటిని సరఫరా చేయడంతోపాటు ఆరోగ్య సురక్ష సేవలైన ప్రాథమిక చికిత్స మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వేతన మోనిటరింగ్ కమిటీతో పాటుగా మూడు అంచెల తనిఖీ వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ఉద్యోగులు అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో బహుళ ప్రయోజనాలు ఒనగూరే విధంగా నరేగా అనుసంధానంతో వేతన కాంపోనెంట్, మెటీరియల్ కాంపోనెంట్ పనులు ప్రతిపాదిస్తూ గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. సేద్యపు నీటి కుంటల ద్వారా నీటి ఎద్దడి తగ్గటంతోపాటు, భూగర్భజలాలు బాగా పెరుగుతాయని, నీటి కుంటల్లో చేపలను పెంచటం వల్ల వివిధ ఉపయోగాలు ఉన్నాయన్నారు. వర్షపు నీటి బొట్టును వడిసి పట్టి సాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపట్టిన సేద్యపు కుంటలు రైతులకు ఎంతగానో ఉపయోగపడు తున్నాయని అన్నారు. వ్యవసాయ అవసరాలకు ఈ కుంటలను వినియోగించుకుంటూనే వీటిలో చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేలాసాగు విధానంలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టి సేద్యపు కుంటల్లో చేపల సాగుకు వినియోగించు కుంటున్నారన్నారు. పంట కుంటల ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతున్న రైతులను చూసిన ఇతర రైతులు సైతం తమ పొలాల్లో పంట కుంటలు తవ్వుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నీటి కుంటల్లో చేపలు పెంచటం వల్ల, ఆ నీటిని పంట పొలాలకు అందించటం ద్వారా పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ సిహెచ్ఎన్‌వి.కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ పి.రామకృష్ణారెడ్డి, తది తరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి టీముల ఏర్పాటు

ప్రజాశక్తి - అమలాపురం

మహిళల భద్రత కోసం జిల్లాలో నూతనంగా శక్తి టీమ్స్‌ని ఏర్పాటుచేసి నట్లు ఎస్పి బి.కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు కార్యాలయం నుంచి శక్తి వెహికల్స్ ను శుక్రవారం ఎస్పీ బి.కష్ణారావు ప్రారంభించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో ఐదు శక్తి టీమ్స్ ను ఏర్పాటు చేశామన్నారు. అమలాపురం సబ్ డివిజన్ కు రెండు టీంలు, కొత్తపేట సబ్ డివిజన్ కు రెండు టీంలు, రామచంద్రపురం డివిజన్ కు ఒక టీమ్ కేటాయించినట్లు తెలిపారు. ఈ ఐదు టీమ్ లు కూడా జిల్లా వ్యాప్తంగా మహిళలు ఆడపిల్లల భద్రతకు ప్రత్యేకంగా పనిచేయనున్నట్లు తెలిపారు. మహిళలు, ఆడపిల్లల భద్రతకు మరింత చురుకుగా పని చేయాలని శక్తి టీం మెంబెర్లతో, మహిళా సిబ్బందితో, మహిళా పోలీస్ సిబ్బందికి తెలియజేశారు. శక్తి ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ యాప్ యొక్క ఉపయోగాలను ప్రజలందరికీ తెలిసేలా కార్యాచరణలు చేపట్టాలని సూచించారు. మహిళా పోలీసులందరూ వారి పరిధిలో మహిళలు, ఆడపిల్లలకు చేరువుగా ఉంటూ సత్సంబంధాలు మెరుగుపరచుకొని ఏ సమస్య అయినా ధైర్యంగా చెప్పుకునే విధంగా వారితో మెలగాలని సూచించారు. జిల్లాలోని మహిళలు ఆడపిల్లలు ఎవరికైనా ఎటువంటి సమస్య వచ్చిన ధైర్యంగా పోలీసులకుతెలియజేయాలని, అత్యవసర సమయంలో శక్తి యాప్ ను ఉపయోగించుకోవాలని కోరారు.



శక్తి వెహికల్స్ ను ప్రారంభిస్తున్న ఎస్పి కృష్ణారావు



చైతన్యయాత్రల కరపత్రం ఆవిష్కరణలో పాల్గొన్న సిపిఎం నాయకులు

25 నుంచి ప్రజా చైతన్య సైకిల్ యాత్ర

సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నాలుగు రోజులు జరిగే చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటున్నారన్నారు. శుక్రవారం అమలాపురం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజా చైతన్య యాత్ర సంబంధించి కరపత్రం ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అండ్రా మాల్యాద్రి మాట్లాడుతూ అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్ మండలం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం మండలాల్లో ఈ ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ యాత్ర జయప్రదానికి ప్రజలు సహాయ, సహకారాలు అందించి జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ముఖ్యంగా ఈ మండలాలలో కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, దళితులు, బలహీనవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యల పరిష్కారం దిశగా ఈ ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. ఏప్రిల్ 1వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు జి.దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, నాయకులు శ్యామలా, శివ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రధాన డిమాండ్లు

1) జిల్లాలో భూస్వాములు ఆక్రమణలో ఉన్న లక్షలాది కొబ్బరి చెట్లు పేదలకు పంచాలి, 2) పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. జగనన్న కాలనీలు లే-అవుట్లు మెరక చేయాలి. టిడ్కో ఇళ్లు రుణాలు బలవంతపు వసూళ్లు ఆపాలి. 3) వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పనులు 200 రోజులు చెప్పాలి. రూ.600 వేతనం ఇవ్వాలి. 4) మత్స్యకార గ్రామాల సమస్యలు పరిష్కరించాలి. బోడసకుర్రు, పల్లిపాలెంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలి. అర్హులైన వారికి మత్స్యకార భరోసా చెల్లించాలి. 5) దళిత గ్రామాలలో మౌళిక వసతులు కల్పించాలి. స్మశాన వాటికలు కొనుగోలు చేసి ఇవ్వాలి. 6) గ్రామాలకు ఆనుకుని ఉన్న మద్యం షాపులు, బెల్ట్ షాపులు తొలగించాలి. 7) కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. రూ.50వేలు ఎకరాకు రుణం ఇవ్వాలి. రైతులకు సాగు నీరు శివారు ప్రాంతాలకు కూడా అందించాలి. 8) ఒఎన్‌జిసి కాలుష్యాన్ని అరి కట్టాలి. సి.యస్.ఆర్. నిధుల ద్వారా గ్రామాల అభివృద్ధి చేయాలి. 9) అక్రమ ఆక్వా చెరువులను అరికట్టాలి, ఆక్వా కాలుష్యాన్ని నియంత్రించాలి. 10) కామనగరువులో ప్రభుత్వం మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధీనంలో నడపాలి. అక్కడ పేదలకు నష్టపరిహారం చెల్లించాలి.11) జిల్లాలో రైల్వే లైన్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలి. (12) కొటిపల్లి - ముక్తేశ్వరం రేవు పై వంతెన నిర్మాణం చేపట్టాలి. 13) అమలాపురం పట్టణం ట్రాఫిక్ ను నియంత్రించాలి, అదనంగా ఎర్రవంతెన, ఈదరపల్లి, నల్ల వంతెనల వద్ద బ్రిడ్జిల నిర్మాణం చేయాలి.




ప్రశ్నాపత్రాల ప్రతులను అందజేస్తున్న అధికారులు

అసెస్మెంట్ పరీక్ష నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ.రాజు ఆధ్వర్యంలో ఉల్లాస్ వయోజన విద్య అభ్యాసకులకు అసెస్మెంట్ పరీక్ష నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, విద్యాశాఖలతో సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈనెల 23న మండలంలో గల 792 మంది ఉల్లాస్ అభ్యాసకులకు అసెస్మెంట్ పరీక్ష మండలంలో గల 28 పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ పరీక్షకు సంబంధించి ఎన్విజిలేటర్లుగా అంగన్‌వాడీ టీచర్లను నియమించామన్నారు. ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో 28 సెంటర్లలో పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించిన మెటీరియల్ను డ్వాక్రా యానిమేటర్ల ద్వారా గ్రామాలకు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ మోడల్ ఆఫీసర్ విజయభాస్కర్, ఎంఇఒ బి.అప్పాజీ, ఎపిఎం ఎం.ధనరాజు, అంగన్‌వాడీ సూపర్వైజర్లు నాగలక్ష్మి, అరుంధతి, అంగన్వాడి టీచర్లు, డ్వాక్రా యానిమేటర్లు, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వర్గీకరణ నిలిపి వేయాలని నిరసన



ఐ.పోలవరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - యంత్రాంగం

వర్గీకరణకు వ్యతిరేకంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మాలమహానాడు నాయకులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ధర్నాలు చేసి వినతిపత్రాలు అందజేశారు.

ఐ.పోలవరం: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణలో రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ రిపోర్టును రద్దు చేయాలని పలువురు నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. ఐ.పోలవరం మాల మహానాడు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్‌సి నాయకులు మాట్లాడుతూ రంజన్ మిశ్రా కమిషన్ తప్పులు తడక నివేదికను ప్రభుత్వానికి అందించడం సిగ్గు చేటని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ నిలుపుదల చేయాలని ఆందోళన చేశారు. ఎస్‌సి వర్గీకరణ నిలుపుదల చేయని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్‌సిలకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ సిహెచ్.విజయశ్రీ తో నాయకులు మాట్లాడి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రేవు శ్రీను, కాశి పరివాజ్ కుమార్, మట్టా గగనవీరుడు, వడ్డి గౌతం, మోకా రవి, తాళ్లూరి ప్రసాద్, దుక్కిపాటి సత్యనారాయణ, ములపర్తి శ్రీను బాబు,పండు చంద్రరావు పాల్గొన్నారు.

కాట్రేనికోన: ఎస్‌సి వర్గీకరణ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ మండలంలో శుక్రవారం నుంచి మాల మహానాడు నాయ కులు గేట్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేస్తున్న వర్గీకరణ చెల్లదని గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పినప్పటికీ కేవలం ఓట్ల రాజకీయం కోసం పార్టీ లు పబ్బం గడుపుకోవడానికి వర్గీకరణ అనే అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ఈ దీక్షల్లో నల్లా నరసింహమూర్తి, ఇసుకపట్ల రాంబాబు, వడ్డి శ్యామ్ ప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు, గెల్లా రాజేంద్ర, వాకపల్లి భీమరావు, నందిక క్రాంతి కుమార్, పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ రిలే నిరాహార దీక్ష లను జిల్లా మాలమహా నాయకులు పి.పరుశురాముడు, నందిక శ్రీనివాస్రావు, అమలాపురం బార్ అసోసియేషన్ నాయకులు నందిక శ్రీనివాస్ తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు.



కాట్రేనికోనలో మాలమహానాడు నాయకుల రిలే నిరాహార దీక్షలు



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన సదస్సు

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రిసోర్స్ పర్సన్ పాము వెంకటేశ్వరరావు అన్నారు. ఆనాతవరం పంచాయతీ పరిధిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ వద్ద శుక్రవారం ఇఒపిఆర్‌డి కె.లక్ష్మి కల్యాణి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర(పారిశుధ్య సిబ్బందికి) ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు చెత్తను రోడ్ల పక్కన, మురుగు డ్రెయినేజీల్లో వేయవద్దన్నారు. ఇంట్లో వాడిన తడి, పొడి, ఘన వ్యర్థా లైన చెత్తన పంచాయతీ పరిధిలో పని చేసే క్లాప్ మిత్రాలు చెత్తను సేకరించే వాహనాల్లో ఇంటింటికి వెళ్లి తడి, పొడి, హానికర చెత్తలను సేకరిస్తారన్నారు. వాటిని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాలకు తరలించి తడి, పొడి, హానికర చెత్తను వేరు వేరు చేయడం ద్వారా ప్రాసెసింగ్ చేయడం సులభతరం అవుతుందన్నారు. తడి చెత్త నుండి ఎరువులు, వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయవచ్చునని, పొడి చెత్తను రీ సైక్లింగ్ చేయడం ద్వారా వాతావరణాన్ని కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, ఉప్పలగుప్తం ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సిహెచ్‌వి కె.సురేష్ క్లాప్ మిత్రాలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - మండపేట

మార్షల్ ఆర్ట్స్ మహిళలకు రక్షణ ఉంటుందని మండపేట రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు అన్నారు. ఇప్పనపాడు ప్రభుత్వ పాఠశాల లో శుక్రవారం బాలికలకు మార్షల్ ఆర్ట్స్ నిపుణులు గ్రాండ్ మాస్టర్ టి. అబ్బులు నేతృత్వం లో ఆత్మ రక్షణ మెళకువలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు శాఖ మహిళలకు రక్షణగా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచి బాలికలు స్వీయ సంరక్షణ నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. కరాటే లో శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, మదర్ థెరిసా సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ టి. అబ్బులు, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఎం.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ఈతకోట ఎన్ఎసిఎల్ కంపెనీలో జరిగిన భద్రతా వారోత్సవాలు

ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఈతకోట ఎన్ఎసిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం ప్లాంట్ హెడ్ బి.పార్వతి కుమార్ అధ్యక్షతన జరిగిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.మురళీకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రాధాకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ప్రతీ కార్మికుడు వ్యక్తిగత భద్రత తో పాటు క్రమ శిక్షణా చర్యలు పాటించాలన్నారు. ఎన్ఎసిఎల్ 11.5 మిలియన్ సేఫ్టీ మాన్ హౌర్స్ సాధించారని పేర్కొన్నారు. భద్రత అనేది ఇంటి నుండి మొదలు కావాలని ప్రమాదరహిత ఫ్యాక్టరీలలో ఎన్ఎసిఎల్ ఫ్యాక్టరీ ఒకటిగా నిలవడం సమిష్టి కృషికి నిదర్శనమని అభినందించారు అనంతరం భద్రతా క్విజ్, వ్యాసరచన, స్లోగన్స్ ,సేఫ్టీ పోస్టర్స్, ఫైర్ డ్రిల్ పోటీలలో గెలుపొందిన కార్మికులకు, ఈతకోట, గంటి, పలివెల స్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌పిడిహెడ్ ఎమ్.తాతారావు, జెవిఎస్.ప్రకాశరావు, సేఫ్టీ ఆఫీసర్ పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పేరవరం నీటి సంఘం ఆయకట్టు పరిధిలోగల వరి పంట పొలాలకు, ఉద్యానవన పంటలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నీటి సంఘం అధ్యక్షులు జుజ్జవరపు శ్రీహరి అన్నారు. ఆయన శుక్రవారం రైతులకు సాగినీటి ఇబ్బందులు లేకుండా పంట కాలువలలో గుర్రపు డెక్క, తూడును జెసిపి సాయంతో తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి చేలు ఈనిక దశలో ఉన్నందున ప్రస్తుతం వంతులు వారి విధానంలో సాగు నీటకి ఇబ్బంది లేకుండా పంట కాలవలు శుభ్రం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

మోకాలి వద్ద కణితి తొలగింపు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో అరుదైన మోకాలు ఆపరేషన్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్ నిర్వహించారు. మోకాలికి వెనుక భాగంలో ఏర్పడిన అర కేజీ సైజు గల కణితిని సర్జరీ ద్వారా తొలగించారు. చెల్లుబోయిన సత్యనారాయణకు మోకాళ్ల వద్ద కణితి ఏర్పడి తీవ్ర నొప్పితో బాధపడుతున్నాడు ఎంతో కాలంగా ఉన్న కణితిని ఆపరేషన్ ద్వారా తొలగించారు. ప్రస్తుతం రోగి సత్యనారాయణ ఆరోగ్యంగా ఉన్నట్లు సూపరింటెండెంట్ ప్రవీణ్ తెలిపారు. ఈ కనిణిని కేన్సర్ పరీక్షలు కోసం బయాప్సీ పరీక్షలకు పంపించినట్లు ఆయన వివరించారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని కాట్రేనికోన పంచాయతీ శివారు వేట్లపాలెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు దాతలు కుచ్చర్లపాటి వెంకటరామరాజు, నిమ్మకాయల రాజాల ఆర్థిక సహాయంతో నిర్మించిన సైకిల్‌స్టాండ్‌ను వెంకటరమణ శుక్రవారం ప్రారంభించారు. సందర్భంగా గ్రామస్తులు పాఠశాల సిబ్బంది ఇరువురి దాతలను సత్కరించారు.

ఆదరణ-3పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి శుక్రవారం మండలంలో గల 10 గ్రామ పంచాయతీలలో వెనుకబడిన వర్గాల కుల వృత్తుల వారికి ఆదరణ-3 పథకము కింద లబ్ధిదారులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ కుల వృత్తుల వారు సుమారుగా 150 మంది హాజర య్యారు. వారికి అవసరమైన పనిముట్ల కొరకు వివరాలు తెలుసుకున్నారు ఈ విషయం కలెక్టర్‌కు, పనిముట్ల సరఫరా కొరకు బిసి కార్పొరేషన్ వారికి తెలియజేస్తారు. సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు, విస్తరణ అధికారి, పరిపాలనా అధికారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు అందజేస్తున్న మంత్రి సుభాష్

మతసామరస్యానికి ఇఫ్తార్ విందు దోహదం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మతసామరస్యానికి, సమాజంలో సమానత్వం, శాంతి కోసం ఇఫ్తార్ విందులు దోహదపడతాయని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురంలోని చిన్న మసీదు, పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరులను పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని, ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును అందించారు. సందర్భంగా మంత్రి సుభాష్‌ను ముస్లిం పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు కేన్సర్ వ్యాధిగ్రసులకు ప్రత్యేక వైద్య శిబిరం

కేన్సర్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, వారికి మెరుగైన వైద్య సహాయం అందించేందుకు గుంటూరు హాస్పిటల్లో ప్రత్యేక వైద్యం చేయించేందుకు అవసరమైన మందులు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మంత్రి సుభాష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికోసం ఈనెల 22న శనివారం రోగుల వివరాలు వైద్యుల సమక్షంలో నమోదు చేయించుకోవాలన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయానికి రాలేని వారు బంధువులు లేదా సహాయకులు ద్వారా వ్యాధిగ్రస్తుల వివరాలు అందించవచ్చునని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ అమలుపై హర్షం

ప్రజాశక్తి - మండపేట

ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్‌సి వర్గీకరణ అమలు చేసిన ఘనత సిఎం నారా చంద్రబాబుకే దక్కుతుందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండపేట లో మీడియాతో మాట్లాడుతూ రెండు దశాబ్దాల పోరాటం ఇన్నాళ్లకు నెరవేరిందన్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ప్రజాశక్తి - అల్లవరం

కొమరగిరిపట్నంలో ట్రైనింగ్ సెంటర్ ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద అల్లవరం, అమలాపురం, మామిడికుదురు, మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రా లకు చెత్త నుంచి సంపద తయారీ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట, నాడెపు తొ ట్టెలలో సెమీ కంపోస్ట్ తయారి విధానం, వెర్మీ తొట్టెలలో వెర్మీ కంపోస్ట్ తయారీ విధానం పై అల్లవరం విస్తరణ అధికారి యూ నాగేంద్ర , ఫ్ టి సి మధు మహేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యమంలో గ్రామ సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, , మామిడికుదురు, అమలాపురం మండలాల విస్తరణ అధికారులు పాల్గొనియున్నారు.

ఎన్నికల నిర్వహణకు సూచనలు అందజేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఓటరు జాబితా సవరణ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తగు సూచనలు, సలహాలు తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి కోరా రు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయి సూచనలు, సలహాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా చేపట్టడానికి తరచూ సలహాలు సూచనలు ఇవ్వాలని ప్రతినిధులను కోరారు. ప్రతి మూడు మాసాలకు ఒకసారి 18 సంవత్సరాల నిండిన వారు ఓటర్ గా నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని, సమీపంలోని గ్రామ సచివాలయాలను సందర్శించి ఓటర్ గా నమోదు చేసుకొన వచ్చునన్నారు. వయసుల వారీగా ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఫారం 6, 7, 8 ల క్లెయిమ్లను పారదర్శకంగా పరిష్కరిస్తామన్నారు. ఈ నమోదు ప్రక్రియకు సంబంధించి ఏవైనా ఆభంతరాలు, వినతులు ఉంటే ఎప్పటికపుడు తమ దృష్టికి తీసుకుని రావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలకు కనీసం 2 కి.మీ. దూరంలోపే ఉన్నాయని అంతకంటే ఎక్కువ దూరం ఉంటే ప్రత్యేక పోలింగ్ బూత్ ను ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇస్తుందన్నారు. ఇంకా ఎక్కడైనా అవసరం అనుకంటే తగిన ప్రతిపాదనలు సమర్పిస్తామన్నారు.ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, ప్రక్రియల గురించి రాజకీయ పార్టీలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు.ఏ రకమైన ఎన్నికనైనా సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ తోపాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకొని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఆమేరకు ఇకపై ప్రతి నెల గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ, జిల్లాస్థ యిలలో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సూచనలను తీసుకొని ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చురుగ్గా ఉండి వారి దృష్టికి వచ్చిన ఎన్నికల అంశాలు ఏమైనా ఉంటే వాటిని సమావేశంలో తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిదిద్దడం వలన స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారవుతుందని తద్వారా రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా విశ్వాసం కలుగుతుందన్నారు. టిడ్కో గృహాలలో ఉంటున్న వారికి ఇంకా స్థానికంగానే ఓటు హక్కు ఉందని వీరు ఓట్లను టిడ్కో ప్రాంతానికి మార్పు చేయాలని ప్రతినిధులు కోరగా ఆ విధంగా చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి తరపున అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, భారతీయ జనతా పార్టీ తరపున దూరి రాజేష్, జనసేన తరపున చిక్కాల సతీష్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున వడ్డీ నాగేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ తరపున భవాని, ఉప తహశీల్దార్ శివరాజ్, జూనియర్ అసిస్టెంట్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి

నేరాలు ఘోరాలు


మీడియాకు వివరాలను వెల్లడిస్తున్న మండపేట సిఐ సురేష్

కుమార్తే హంతకురాలు

ప్రజాశక్తి - మండపేట

తండ్రి హత్య కేసులో కుమార్తె హంతకురాలిగా తేలింది. తన సంతోషాలకు అడ్డుగా ఉన్నాడనే కారణంగా ప్రియునితో కలిసి కన్న తండ్రిని హత్య చేసింది. మండపేట సిఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు...మండపేట మేదరపేటకు చెందిన సురా రాంబాబుకు వెంకటదుర్గ అనే కుమార్తె ఉంది. ఆమెకు వివాహమై భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త, పిల్లలతో కలిసి మండపేటలోనే నివాశముంటుంది. కొంత కాలంగా రామచంద్రపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్తో దుర్గ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలియడంతో భర్త ఆమె నుంచి విడిపోయి అదే ప్రాంతంలో ఒంటరిగా ఉంటున్నాడు. దుర్గ తీరులో మార్పు రాకపోవడంతో తండ్రి రాంబాబు సైతం ఆమెను గట్టిగా మందలించాడు. దీంతో ఎలాగైనా తండ్రిని మట్టుబెట్టాలనుకుంది. ఈ మేరకు రాంబాబు హత్యకు ప్రియునితో కలిసి ప్రణాళిక వేసింది. మార్చి 16 రాత్రి ప్రియుడు సురేష్కు ఫోన్ చేసి ఇంటికి పిలిచింది. స్నేహితుడు తాటికొండ నాగార్జునను వెంటబెట్టుకుని సురేష్ మండపేటలో దుర్గ ఇంటికి వచ్చాడు. అక్కడ నుంచి వీరు ముగ్గురూ స్థానికంగా ఉంటుంటున్న రాంబాబు ఇంటికి వెళ్లారు. పడుకున్న రాంబాబు కాళ్లు చేతులు గట్టిగా పట్టుకుని గొంతు నులిమి హత్య చేశారు. రాంబాబు సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించారు. పోస్టు మార్టం రిపోర్టులో హత్యగా తేలడంతో దర్యాప్తును వేగవంతం చేశారు. అనుమానితురాలిగా ఉన్న దుర్గను ప్రశ్నించడంతో పక్కా ప్రణాళిక ప్రకారమే తండ్రిని చంపినట్లు అంగీకరించింది. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు తరలించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని టౌన్ సిఐ సురేష్ తెలిపారు.

పొగాకు బేరన్ దగ్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంటలో శుక్రవారం జుజ్జవరపు రామలక్ష్మికి చెందిన పొగాకు బేరన్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.5లక్షల నష్టం వాటిల్లింది. క్యూరింగ్ చేస్తున్న సమయంలో పొగాకు కర్రలు ఊడిపడి ప్రధాన గొట్టంపై పడడంతో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపు కాకపోవడంతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. జంగారెడ్డిగూడెం నుండి అగ్రిమాపక వాహనం హుటాహుటిన తరలివచ్చి మంటలను అదుపు చేశారు. టీవల కాలంలో తరచూ అగ్ని ప్రమాదాల సంభవించి లక్షలాది రూపాయలు విలువ చేసే వర్జీనియా పొగాకు కాలిపోవడంతో రైతులకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. గోపాలపురం నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజానగరం

తన భర్త కనపడడం లేదంటూ రాజానగరం పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఒక మహిళ ఫిర్యాదు చేసింది. శ్రీరామ్పురం గ్రామానికి చెందిన కరెడ్ల రాంబాబు (36) తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాంబాబు తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల దగ్గర వెతికినా సమాచారం లేకపోవడంతో అతని భార్య కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్.ఐ నాగార్జున కేసు నమోదు చేశారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - అయినవిల్లి

చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి అయిదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారని పి.గన్నవరం సిఐ ఆర్.భీమరాజు శుక్రవారం తెలిపారు. అయినవిల్లి లంక గ్రామ శివారు గాలితిప్పపేటకు చెందిన డెక్క రాంబాబు అదే గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిపై 2023లో అత్యాచారయత్నం చేశాడు. పాప తల్లికి జరిగిన విషయం చెప్పడంతో పోలీస్ స్టేషన్లో రాంబాబుపై ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి. దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుపై శుక్రవారం కాకినాడ ఫోక్స్ కోర్టులో న్యాయమూర్తి కె.శ్రీదేవి నిందితునికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష. వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది జి వెంకటరత్నం వాదనలు వినిపించారు.

పాము కాటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-కిర్లంపూడి

కృష్ణవరం గ్రామపంచాయతీ పరిధిలో పంట కాలువలో శుక్రవారం పూడికతీత పనిచేస్తుండగా ఉపాధి హామీ పని వేతనదారుడు నీలాద్రి అప్పారావు పాము కాటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు ఎపిఒ నాయుడు తెలిపారు.

గౌరవ అధ్యక్షుని పదవికి వెంకన్నాయుడు రాజీనామా

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమ వికలాంగు గౌరవ అధ్యక్ష పదవికి వంటెద్దు వెంకన్నాయుడు రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోనసీమ వికలాంగ సంఘానికి గౌరవాధ్యక్షులుగా నన్ను నియమించుకుని గౌరవించిన సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నా శక్తి కొలది వికలాంగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానన్నారు. నా వ్యక్తిగత కారణాలు, పనుల ఒత్తిడి వలన పదవికి రాజీనామా చేస్తున్నానని అన్నారు. ఎప్పటిలాగే వికలాంగుల పట్ల, వారి అవసరాలు పట్ల సేవలు అందించేందుకు అందుబాటులోనే ఉంటానని తెలియజేస్తున్నానని అన్నారు.

డిపోలో కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి - అమలాపురం

డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టిసి డిపోలో నిరసనలు కొనసాగాయి. యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టిసి డిపో వద్ద సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె. రంగ ప్రసాద్ మాట్లాడుతూ అమలాపురం డిపోలో 1/ 19 సర్క్యులర్ అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ అయిన డ్రైవర్ బిఎస్.నారాయణని డ్యూటీలోనికి తీసుకోవాలని, రాజోలు నుంచి వచ్చిన డ్రైవర్ కెజి.రావుని డ్రైవర్ కమ్ కండక్టర్ డ్యూటీకి వెళ్లాలని వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ కెజి.రావు డిపోలో అందుబాటులో ఉన్నప్పటికీ రోజూ గైర్హాజరు అని చెప్పి ఆబ్సెంట్ వేయడం దారుణమన్నారు. ఏపి హైకోర్టు ఆదేశాలను గౌరవించి అతన్ని డ్రైవర్ డ్యూటీ కి మాత్రమే పంపాలని డిమాండ్ చేశారు. గేట్ మీటింగ్ నందు నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో ప్రెసిడెంట్ ఔలియా మాట్లాడుతూ బలవంతంగా టిమ్ డ్యూటీలకు పంపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, డ్రైవర్ బిఎస్. నారాయణ కూడా బలవంతంగా టిమ్ డ్యూటీకి వెళ్లడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైనదన్నారు. ఇష్టం లేకుండా టిమ్ సర్వీసులకు పంపరాదని కోరారు. అమలాపురం డిపోలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందన్నారు. బేషరతుగా ఇద్దరు డ్రైవర్లను డ్యూటీ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 26 రోజులుగా డిపోలో నిరాహార దీక్షలు చేస్తున్నారని, ఇప్పటికైనా ఆర్టిసి ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బేషరతుగా ఇద్దరు డ్రైవర్లను డ్యూటీకి తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ార్యక్రమంలో పెద్ద ఎత్తున రెండు యూనియన్ల నాయకులు, సభ్యులు, ఆర్టిసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు.

ఉప్పలగుప్తం: రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి జి.కుమార్ బాబు సూచించారు. ఉప్పలగుప్తం మహిళా శక్తి భవన్ లో శుక్రవారం వ్యవసాయ శాఖ, ఎపిసిఎన్ఎఫ్, డిఆర్డిఎల సంయుక్త ఆధ్వర్యంలో ప్రకతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు సంస్థలు కలిసి పనిచేసి రాష్ట్రంలోని 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు అరిగెల నానాజీ, మంచెం బాలయోష్ణ, పాటి రామకృష్ణ, గుత్తుల నాగరాజులను సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ హేమలత, ఎంటి సూరిబాబు, యూనిట్ ఇన్ఛార్జి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** ప్రకృతి వ్యవసాయం తోనే ఆరోగ్యమని మండల వ్యవసాయ అధికారి కెవిఎన్.రమేష్కుమార్ అన్నారు. మండలం మహిళా సమైక్య కార్యాలయంలో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ లో ప్రకృతి వ్యవసాయం, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ హార్టికల్చర్తో కలిసి ప్రభుత్వ ఆదేశాల మేరకు పై మూడు సంస్థలతో పని చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులందరితో పి ఎం డి ఎస్ 36 రకాల విత్తనాలతో ప్రకతి వ్యవసాయం చేయించాలని దీనికి పై మూడు సంస్థలు సహకారం అందిస్తాయని తెలిపారు. సమావేశంలో ఎపి సిఎన్ఎఫ్ బందం, డిఆర్డిఎ స్టాఫ్, ఎపిఎం.స్వర్ణ కుమారి, వివిధ గ్రామాల గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తదితరురలు పాల్గొన్నారు. **మామిడికుదురు:** ప్రకృతి వ్యవసాయం తో పండించే కూరగాయలు వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యము పొందవచ్చని అడిషనల్ డిపిఎం సత్యనారాయణ పేర్కొన్నారు మామిడి కుదురు మండలమహిళా సమైక్య కార్యాలయంలో కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఎ రాధిక, ఎంటి.నాగవేణి, ఎపిఎం. వరాలబాబు తదితరులు పాల్గొన్నారు.

చమురు సంస్థల వైఖరిపై రిలే దీక్షలు

ప్రజాశక్తి - అల్లవరం

చమురు సంస్థల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, ఓడలరేవు గ్రామ అభివృద్ధి కొరకు ఓడలరేవు గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరింది. మండలం జనసేన పార్టీ నాయకులు ఓడలరేవు గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు రొక్కాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓడలరేవు గ్రామంలో గత మూడు దశాబ్దాల నుండి చమురు సంస్థలు రూ.కోట్లు తరలించుకుపోతున్నాయని అన్నారు. కానిఈ గ్రామాన్ని అభివృద్ధి చేయటంలో, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో చమురు సంస్థలు నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తున్నామయని అన్నారు. ప్రమోటెక్ కంపెనీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిరోద్యోగ యువతను మోసాగిస్తుందని ఆగ్రహ వ్యక్తం చేశారు. గత 19 రోజులనుండి దీక్షలు చేస్తున్న ఇప్పటివరకు చమురు సంస్థలు పట్టించుకోకుండా వుండటం దారుణమన్నారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్,టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరు సత్యనారాయణ రాజు, కొల్లు విష్ణుమూర్తి, జనసేన నాయకులు గుర్రం కృష్ణ, గునిశెట్టి చినబాబు, కంకిపాటి గోపి,తిక్క శేషుబాబు,పోలిశెట్టి బాబులు, కామాడి గంగా భవాని,గోళ్ళ కమల,చెట్ల మంగ తయారు, నల్ల రాము, ఆకుల నాగ శ్రీను, కాకిలేటి హరికష్ణ, పోతుల రవికిరణ్, పిండి గణపయ్య, యాళ్ల బిందాస్, నాతి లెన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని దర్శించుకున్న సాయినాథ్

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని శుక్రవారం జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ నూతన ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.సాయినాథ్ జయచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం లో పూజలు నిర్వహించారు. ఇఒ ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలకగా అర్చకులు వేద ఆశీర్వచనం, తీర్ధ ప్రసాదాలు అందజేసి, శేష వస్త్రముతో సత్కరించారు. అనంతరం స్వామివారి చిత్రపటం బహూకరించారు. ఆయన వెంట డిపిఎం హెచ్ఆర్.విజయ్ కుమార్, ఎపిఎం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎంఆర్పిఎస్ విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

జిల్లా ఎంఆర్పిఎస్ విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు రాచర్ల అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర వీర రాఘవులు, ఎం ఎస్ పి ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు పాల్గొన్నారు. ముందుగా బాబు జగజ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రధాన లక్ష్యంగా సుదీర్ఘ పోరాటం చేసిన పద్మశ్రీ మందకష్ణ మాదిగ చిత్రపటానికి, అందుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్కు, కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు చిత్రపటాలకు క్షీరాభిషేకరి స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

కోర్టు ప్రాంగణంలో రక్షిత మంచినీరు ఏర్పాటు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో రక్షిత మంచినీటిని ఏర్పాటు చేశారు. శుక్రవారం 13వ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎం.శంకర్రావు చేతుల మీదుగా ఇక్కడ ఏర్పాటుచేసిన ఆర్ఒ ప్యూరిఫైయర్ ప్రారంభించారు. కోర్టుకు వచ్చే కక్షిదారుల దాహార్తిని తీర్చేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు . స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ అరుణ సౌజన్యంతో ఈ ప్యూరిఫైయర్ ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్ ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, పిల్లా పద్వి, ఎస్.వి.శేషు కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టెక్ ఫెస్ట్ ఆవిష్కార్- 2కె25

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యరు శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులలో గల పరిశోధన నైపుణ్యాని పెంపొందించే టెక్ ఫెస్ట్ ఆవిష్కార్- 2కె25 ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ జ్యోతి వెలిగించి చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను పరిశోధన నైపుణ్యాలను పెపొందించుటకు ఉద్దేశించబడిన సాంకేతిక ఉత్సవం అయిన ఆవిష్కార్ 2కె25 ను నిర్వహిస్తున్నామన్నారు. సాంకేతిక విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి నేర్చుకున్నటువంటి విషయ పరిజ్ఞానాని ప్రయోగాత్మకంగా సమాజాభివృద్ధికి ఉపయోగించేలా నైపుణ్యములను సాధించి నూతన ఆవిష్కర్తలుగా రూపుదిద్దుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పట్ల విస్తృత అవగాహనా కల్పించుట దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జెఎన్టియుకె పరిశోధన విభాగాధిపతి డాక్టర్ ఎ.గోపాల కష్ణ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నవ భారత నిర్మాణానికి అవసరమగు పరిశోధనలు చేయడం నాణ్యమైన పరిశోధన పత్రాలు రూపొందించటం ద్వారా భావి ఆవిష్కర్తలుగా రూపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రముఖ కళాశాల ల విద్యార్థులు కళాశాలలో నిర్వహించిన వివిధ విభాగాల పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్పో, టెక్నికల్ క్విజ్, విభాగాలలో వివిధ అంశములలపై విద్యార్థుల నైపుణ్యాని పరీక్షించి అందునా అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమములో వివిధ విభాగాధిపతులు, కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


చెముడులంకలో శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు పాల్గొన్న నాయకులు

ఘనంగా జనసేన నేత శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధి 18 గ్రామాలలో నియోజకవర్గ జనసేన ఇన్ఛార్జి బండారు శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చెముడులంకలో మాజీ ఎంపిటిసి, జనసేన నేత నాగిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య అధ్యక్షతన శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా బాణసంచా కాల్చి, బర్తడే కేక్ ను కట్ చేసి, వితరణ చేసి, వారంతా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంక వరప్రసాదరావు, ఎంపిటిసి సభ్యులు జాంపోలు నాగేశ్వరరావు, జన సేన నేతలు సలాది జయప్రకాష్ నారాయణ, నాగిరెడ్డి మహేష్, పడాల అమ్మిరాజు, కొత్తపల్లి నగేష్, తమ్మన ఏసు, అడబాల వీరాజు, పామర్తి పేరాజు, పేరపు చిన్న, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులు పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వైద్యాధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఆయన సందర్శించి ల్యాబ్ తనిఖీ చేశారు. ఎల్టి ఎం.పల్లంశెట్టికి పలు సూచనలు ఇస్తూ సకాలంలో రక్త పరీక్షలు పూర్తి చేసి రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. ఫీల్డ్ విజిట్స్ లో భాగంగా స్థానిక వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. డ్రెయినేజీ నీటి నిల్వలు పరిశీలించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే దోమల ద్వారా వ్యాపించి డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, వ్యాధులు దరిచేరకుండా ఆరోగ్యవంతంగా ఉండవచ్చు అన్నారు.

డిగ్రీ కళాశాలలో కవితా దినోత్సవం

ప్రజాశక్తి - కొత్తపేట

విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని శుక్రవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి. రాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గణితం హెచ్ఓడి డాక్టర్ డిసిహెచ్. పాపారావు, కామర్స్ లెక్చరర్ సిహెచ్.నాగ శ్రీలక్ష్మి, హిస్టరీ లెక్చరర్ సిహెచ్.భవాని, మ్యాథమెటిక్స్ లెక్చరర్ ఎ.నాగజ్యోతి, తెలుగు లెక్చరర్ కె. సుకదవల్లి తదితరులు పాల్గొన్నారు.

పీడితులకు అండగా కవిత్వం ఉండాలి

మండపేట: పీడితులకు అండగా నిలిచే కవిత్వమే శాశ్వతంగా నిలుస్తుందని సాహితీ గోదావరి అధ్యక్షులు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా జిల్లా అభ్యుదయ రచయితల సంఘం, మండపేట సంగమం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం అన్నపూర్ణ హైస్కూల్ వేదికగా కవులతో ఓ సాయంత్రం కార్యక్రమం నిర్వహించారు. అరసం జిల్లా అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్ స్వాగత వచనాలు పలికారు. కళామిత్ర మీరాభి మీరా సాహెబ్, ప్రముఖ కవులు గొడవర్తి శ్రీనివాస్, ఆర్వివి.రాజా శ్రీనివాసచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

పల్లె వీధుల అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఇన్ఛార్జి డిఎల్పిఒ, ఎంపిడిఒ ఐ.రాజు అన్నారు. మోదుకూరులో రూ. 25 లక్షలు ఉపాధి నిధులతో జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గుత్తేదారులతో మాట్లాడుతూ చేసే ప్రతి పనిలో నాణ్యత ఉండాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. సిసి డ్రైన్లు, రోడ్లు అనుమతులకు అనుగుణంగా, నిబంధనల ప్రకారం నిర్మించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత ఈదల శ్రీనివాస్ చౌదరి, కార్యదర్శి సాయి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - అయినవిల్లి

విద్యార్థులు చట్టలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్ఐ హరికోటి శాస్త్రి విద్యార్థులకు తెలిపారు శుక్రవారం ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమం కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు ఎస్ఐ ఆయన చిన్నపిల్లలు సెల్ఫోన్ వాడటం చట్ట రీత్యా నేరమన్నారు. స్పెషల్ బ్రాంచ్ కి పట్టుపడితే శిక్షార్హులు అవుతారని సెల్ పోన్ దూరంగా పెట్టి పాఠ్యాంశాలపై దృష్టి పెట్టాల న్నారు. కార్యక్రమంలో 8 9 తరగతి విద్యా ర్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బీనాజాన్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జెడి

ప్రజాశక్తి - కొత్తపేట

టెన్త్ పబ్లిక్ పరీక్ష జరుగుతున్న జూనియర్ కళాశాల, ఇతర కేంద్రాలను రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం శుక్రవారం పరిశీలించారు. స్థానిక జూనియర్ కళాశాల సెంటర్ వద్ద మీడి యాతో మాట్లాడుతూ ఇప్పటివరకు తెలుగు, హిందీ పరీక్షలు పూర్తవగా శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పి, విద్యాశాఖ, వైద్య శాఖల ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు 96 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలలో భాగంగా శుక్రవారం 110 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా ఆంగ్ల పరీక్ష జరిగిందని డిఇఒ డాక్టర్ సలీం బాషా తెలిపారు. మొత్తం 18999 మంది విద్యార్థులకు గాను 18903 మంది హాజరుకాగా 96 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లా వ్యాప్తంగా 99.49 శాతం పరీక్షకు హాజరయ్యారు. తనిఖీలో భాగంగా డిఇఒ డాక్టర్ బాషా 3 పరీక్ష కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనర్ 1 పరీక్షా కేంద్రాన్ని, డివైఇఒలు 4 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 4 పరీక్ష కేంద్రాలను, ఎంఇఒలు 20 పరీక్ష కేంద్రాలను, జిల్లా స్థాయి అధికారులు 7 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 39 తనిఖీలు చేశారన్నారు.

పశువుల గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి గొల్లప్రోలు

చెందుర్తిలో పశువుల ఎండు గడ్డి వామి దగ్ధమయ్యింది. ఇబిసి కాలనీలో నివాస ముంటున్న పిర్ల సత్తిబాబు పశువుల మేత నిమిత్తం ఇటీవల రెండెకరాల గడ్డివామి వేసుకున్నారు. శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం కావడంతో వెంటనే పిఠాపురం నుండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడానికి కృషి చేశారు.


కొత్తపూల ఉత్సవంలో అలరించిన గరగ నృత్యం

అలరించిన గరగ నృత్యాలు

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులో శ్రీనూకాంబికా అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని కొత్తపూలు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గరగ నృత్యాలు అలరించాయి. ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానిక అమ్మవారి ఆలయంలో మన్యసీమ నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలను పెద్దగరగకు అలంకరించి నాలుగవ విడత కొత్త పూల ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆసాధుల కళాకారుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి నృత్యాలు చేశారు.